అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people



# వామపక్షాల కన్నెర్ర

- హనుమకొండలో వేలాది మందితో భారీ నిరసన ప్రదర్శన
- ఉద్రిక్తతల మధ్య ఎమ్మెల్యే కూనంనేని సహా వామపక్ష నేతల అరెస్టు

02

ఆదివారం, 28, జూన్ 2026 | సంపుటి : 03 | సంచిక : 135 | పేజీలు : 05 | వెల ₹5



# ఇసుక లీలలు!

**టీజీఎండీసీలో రాండమైజేషన్ 'మాయ'**

- స్టాక్ యార్డుల్లోని సాండ్ బుకింగ్ లో 'గోల్ మాల్'
- ఒకే ఐడీ.. ఒకేరోజు.. నాలుగు డీడీలు!
- మార్కెట్ లో అమ్మి లాభాలు గడిస్తున్న వైనం
- డీడీల దందాతో లారీ యజమానుల ఆవేదన
- వెనుక 'హైదరాబాద్' హస్తం ఉందని ఫిర్యాదు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఒక లారీకి, ఒక ఐడీపై, రోజుకు ఒకే ఒక్క ఇసుక డీడీ రావాలి. కానీ ఇక్కడ సీన్ రివర్స్ అయింది! టెక్నాలజీని అడ్డం పెట్టుకుని కొందరు కేటుగాళ్లు సిస్టమ్‌ను హ్యాక్ చేస్తున్నారో లేక లోపాయికారీ ఒప్పందాలతో మాయ చేస్తున్నారో కానీ.. ఒకే ఐడీపై.. ఒకే రోజు.. ఏకంగా నాలుగు డీడీలు పొందుతూ బాగోతానికి తెరలేపారు. టీజీఎండీసీ (TGMDCC) ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'రాండమైజేషన్' విధానానికి కొందరు పెద్దలు పాతరేస్తున్నారు. సామాన్య లారీ యజమానులకు వారాల తరబడి ఒక్క డీడీ కూడా దొరకక అల్లాడిపోతుంటే, కొందరు కిలాడీలు మాత్రం రోజుకు రెండు నుంచి నాలుగు డీడీలను ఎంచక్కా లాగేస్తూ, వాటిని మార్కెట్లో బ్లాక్‌లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందా వెనుక హైదరాబాద్‌లోని టీజీఎండీసీ ప్రధాన కార్యాలయానికి చెందిన కొందరు కీలక అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

–అక్షరదర్బార్, హనుమకొండ:

04




# డెడ్ లైన్ సెప్టెంబర్ 15


- తొలి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి
- జిల్లాలో 8 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా 'వన మహోత్సవం'
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సుదీర్ఘ సమీక్ష

02

# బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

- తీర్పు వెలువరించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు
- నిందితుడికి రూ.6 వేల జరిమానా

02






# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

- ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై నిర్లక్ష్యం వద్దు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

04

### బాలికపై లైంగిక దాడి కేసులో

# నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

**తీర్పు వెలువరించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు**

**నిందితుడికి రూ.6 వేల జరిమానా**

అక్షరదర్బార్, ములుగు: చిన్నారులు, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, వారిపై ఆకృత్యాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్ హెచ్చరించారు. ములుగు జిల్లా వాజేడు పోలీస్ స్టేషన్ పరిధిలో 11 ఏళ్ల బాలికపై లైంగిక నేరానికి పాల్పడిన నిందితుడికి కోర్టు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. వాజేడు మండలం పూసూరు గ్రామానికి చెందిన కోరం వసంతరావు (డ్రైవర్) అనే వ్యక్తి, 2020లో ఓ 11 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై వాజేడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతితో పాటు, పోక్సో చట్టం కింద విచారణ జరిపారు.

**కోర్టు తీర్పు..**

ఈ కేసును ములుగు ప్రధాన జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి, ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్వీపీ సూర్య చంద్రకళ శనివారం సమగ్రంగా విచారించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. శిక్షతో పాటు రూ.6,000ల జరిమానా కూడా విధించారు.

**పోలీసుల పటిష్ట దర్యాప్తు..**

ఈ కేసులో అప్పటి మొదటి దర్యాప్తు అధికారి, ప్రస్తుత వెంకటాపురం ఎస్ఐ కె తిరుపతి రావు పటిష్టమైన సాక్ష్యాలను, శాస్త్రీయ ఆధారాలను సేకరించి దర్యాప్తు నిర్వహించారు. ఆ తర్వాత జిల్లా పోలీసు శాఖ తరఫున కోర్టు మానిటరింగ్ అధికారి డీఎస్పీ (డీసీఆర్‌బీ) కిషోర్ కుమార్ కేసు విచారణను నిరంతరం పర్యవేక్షించగా.. కోర్టు లైజనింగ్ అధికారులు జి నాగరాజు (ఎస్ఐ), ఎల్ కుమారస్వామి (ఏఎస్ఐ) కోర్టుతో సమన్వయం చేసుకుంటూ సరైన ఆధారాలను సమర్పించారు. ప్రభుత్వం తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి రామ్ సింగ్ కోర్టులో కేసును వాదించి నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో కీలక పాత్ర పోషించారు.

## ధర్మసాగర్ ఇన్ స్పెక్టర్ పై వేటు

**శ్రీధర్ రావును ఏఆర్ అటాచ్డ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు**

అక్షరదర్బార్, హనుమకొండ: విధి నిర్వహణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వరంగల్ కమిషన్ పరిధిలోని ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ శ్రీధర్ రావుపై వేటు పడింది. ఆయన్ను ఏఆర్ అటాచ్డ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్ స్పెక్టర్ శ్రీధర్ రావుపై పలు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. అప్పటి వరకు ఇన్ స్పెక్టర్ శ్రీధర్ రావును ఏఆర్ అటాచ్డ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్ స్పెక్టర్ శ్రీధర్ రావును ఏఆర్ అటాచ్డ్ చేయటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

# మహిళా పీఎస్ కు స్థల పరిశీలన

**వరంగల్, హన్మకొండలో పోలీస్ స్థలాలను పరిశీలించిన సీపీ**

అక్షరదర్బార్, హనుమకొండ: హన్మకొండ జిల్లా నలుమూలల నుండి వచ్చే బాధితులకు త్వరితగతిన అందుబాటులో ఉండేలా, అన్ని రకాల రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులతో నూతన మహిళా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. శనివారం ఆయన పోలీస్ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి స్థల పరిశీలన చేపట్టారు. ప్రస్తుతం సుబేదారి పోలీస్ స్టేషన్ ఆవరణలో కొనసాగుతున్న మహిళా పోలీస్ స్టేషన్-1 భవనానికి ప్రత్యామ్నాయంగా, భీమారంలోని పూర్వ సీఆర్పీఎఫ్ క్యాంపులోని పలు ప్రదేశాలను సీపీ పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే మహిళా పోలీస్ స్టేషన్‌తో పాటు, అక్కడే ఏర్పాటు చేయనున్న 'ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రం' కోసం అవసరమైన స్థలాన్ని, బాధితుల వాహన పార్కింగ్ వసతులను దృష్టిలో ఉంచుకొని అధికారులతో చర్చించారు. భవన నిర్మాణ పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు.

**పోలీస్ శాఖ స్థలాల పరిశీలన**

మహిళా పీఎస్‌తో పాటు వరంగల్ గోపాలస్వామి దేవాలయం ప్రాంతంలోని పూర్వ రీజినల్ క్రైమ్ పోలీస్ స్టేషన్ స్థలాన్ని, కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ) వద్ద ఉన్న పోలీస్ శాఖ స్థలాలను కూడా సీపీ సన్‌ప్రీత్ సింగ్ పరిశీలించారు. ప్రస్తుతం కమిషనరేట్ అధీనంలో ఉన్న ఈ ఖాళీ స్థలాలను రాబోయే రోజుల్లో ఏ విధంగా వినియోగించుకోవాలి, ఎలాంటి నూతన నిర్మాణాలు చేపట్టాలనే అంశంపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో క్రైమ్స్ అదనపు డీసీపీ బాలస్వామి, క్రైమ్స్ ఏసిపి సదయ్య, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, కేఎంసీ, సీసీఎస్, మట్టెవాడ, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, రాఘవేందర్, కరుణాకర్, సుజాత, ఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# డెడ్‌లైన్ సెప్టెంబర్ 15

- **తొలి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి**
- **జిల్లాలో 8 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా 'వన మహోత్సవం'**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సుదీర్ఘ సమీక్ష**




అక్షరదర్బార్, హనుమకొండ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ, వన మహోత్సవం, స్వచ్ఛ భారత్ మిషన్, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్ అధికారులు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మేన శ్రీను ఉపాధి హామీ, వన మహోత్సవం కార్యక్రమాల అమలు పురోగతిని వివరించగా, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులను కలెక్టర్‌కు నివేదించారు.

**సెప్టెంబర్ 15 నాటికి 3,243 ఇండ్లు పూర్తి కావాలి**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో తొలి విడతలో మంజూరైన 3,243 గృహాల నిర్మాణాన్ని రాబోయే సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు గడువు విధించారు. జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న 2,074 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. వీరి అర్హతలను గెజిటెడ్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో నిష్పాక్షికంగా ధృవీకరించి, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేలా ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

**- 750 చదరపు అడుగుల నిబంధన తప్పనిసరి**

నిర్మాణ దశలో ఉన్న ఇళ్లలో స్లాబ్ విస్తీర్ణం ఎట్టి పరిస్థితుల్లోనూ 750 చదరపు అడుగులకు మించకుండా పనులు చేపట్టేలా గృహ నిర్మాణ శాఖ ఏఈలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వన మహోత్సవం సందర్భంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో 8 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని విజయవంతంగా సాధించేందుకు మండలాల వారీగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, డీఆర్‌డీఓ మేన శ్రీను, అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మి ప్రసన్న, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్, హౌసింగ్ డీఈ రవీందర్, పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, వివిధ మండలాల ఎంపీడీవోలు, గెజిటెడ్ అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వామపక్షాల కన్నెర్ర

- **హనుమకొండలో వేలాది మందితో భారీ నిరసన ప్రదర్శన**
- **ఉద్రిక్తతల మధ్య ఎమ్మెల్యే కూనంనేని సహా వామపక్ష నేతల అరెస్టు**




అక్షరదర్బార్, హనుమకొండ: పేదల ఇళ్ళ కూల్చివేతపై వామపక్షాలు కన్నెర్ర చేశాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పేదల గుడిసెలను ప్రభుత్వం కక్ష గట్టి ఇళ్ళ కూల్చివేతకు పాల్పడటంపై శనివారం హనుమకొండ జిల్లా కేంద్రంలో భారీ ఆందోళన నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల వామపక్షాల ఆధ్వర్యంలో వేలాదిమందితో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఏకశిలా పార్కు వద్ద ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించిన అనంతరం హనుమకొండ కలెక్టరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్) మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితర రాష్ట్ర, జిల్లాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శన ఏకశిలా పార్కు నుండి కాళోజీ సెంటర్ మీదుగా సుబేదారి అమరవీరుల స్థూపం వరకు చేరుకున్నది. అనంతరం అమర వీరుల స్థూపం జంక్షన్ లో వామపక్షాల నాయకులు, కార్యకర్తలు, వేలాదిగా తరలి వచ్చిన పేదలు బైఠాయించారు. తమకు ఇళ్ళ స్థలాల పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వామపక్ష కార్యకర్తలు, పేదల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఈ క్రమంలో అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్న పోలీసులు రోడ్డుపై బైఠాయించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సహా వామపక్ష రాష్ట్ర, జిల్లా నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. కూనంనేని సాంబశివరావు, ఇతర నాయకుల అరెస్టులను వామపక్ష పార్టీల కార్యకర్తలు పెద్ద ఎత్తున అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులకు, వామపక్ష పార్టీల కార్యకర్తలకు తోపులాట జరిగింది. అరెస్టులను నిరసిస్తూ పోలీసుల వాహనాలను అడ్డుకోవడంతో పాటు అరెస్టులకు నిరసనగా ప్రధాన రహదారిపై కార్యకర్తలు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, షేక్ బాష్ మియా తదితరులు పాల్గొన్నారు.

## మొగుళ్లపల్లిలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మొగుళ్లపల్లి, జూన్ 27 (అక్షర దర్బార్): మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన చిలకమారి రాజేందర్ అనే వ్యక్తి శనివారం సాయంత్రం తన ఇంటి వెనకాల బట్టలు ఆరబెడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు మొగుళ్లపల్లి ఎస్సై ఎం. సురేష్ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా

శాయంపేట, జూన్ 27 (అక్షర దర్బార్): శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన పలువురికి పరకాల కోర్టు జైలు శిక్ష మరియు జరిమానా విధించినట్లు శాయంపేట ఎస్సై జై పరమేశ్వర్ తెలిపారు. గోవిందాపూర్ గ్రామానికి చెందిన బైరీ శంకర్‌కు కోర్టు 3 రోజులు జైలు శిక్ష మరియు రూ. 2,000 జరిమానా విధించింది. అదేవిధంగా మరో ఆరుగురు మురహరి సంపత్, కట్ట చంటి, తుమ్మల అనిల్, లాడే తిరుపతి, రత్నం దేవరాజు, దోయియపడి రాజా శివాజీలకు కోర్టు మొత్తం రూ. 7,500 జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# 'ఇసుక' లీలలు!

- మార్కెట్ లో అమ్మి లాభాలు గడిస్తున్న వైనం
- డీడీల దందాతో లారీ యజమానుల ఆవేదన
- వెనుక 'హైదరాబాద్' హస్తం ఉందని ఫిర్యాదు



అక్షరదర్బార్, హనుమకొండ : టీజీఎండీసీ స్టాక్ యార్డుల్లోని ఇసుక బుకింగ్ లో గోల్ మాల్ జరుగుతున్నట్లు తెలిసింది. రాండమైజేషన్ విధానంలో కొందరు వాహనదారులు ఇసుక కోసం ఒకే రోజు ఆన్ లైన్ ద్వారా ఒకటి కంటే ఎక్కువ పేమెంట్ స్లిప్ (డీడీ)లను పొందుతున్నట్లు సమాచారం. పోటీ తీవ్రత వల్ల అనేకమంది వాహనదారులకు ఇసుక కోసం ఒక్క పేమెంట్ స్లిప్ కూడా దక్కకపోతుండగా, కొందరు వాహనదారులు ఎంచక్కా రోజు రెండు నుంచి నాలుగు డీడీలను పొందుతుండటం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఇలా సంపాదిస్తున్న డీడీలను సదరు వాహనదారులు మార్కెట్ లో ఇతర వాహనదారులకు అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు. హైదరాబాదులోని టీజీఎండీసీ ప్రధాన కార్యాలయం నుంచి అందుతున్న సహకారంతోనే ఈ దందా నడుస్తున్నట్లు సమాచారం. అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న ఈ వ్యవహారాన్ని తాజాగా ఇసుక లారీల యజమానులు కొందరు టీజీఎండీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

### డీడీ కోసం తీవ్ర పోటీ

ఇసుక క్వారీల వద్ద గల స్టాక్ యార్డుల్లోని ఇసుక విక్రయాలకు టీజీఎండీసీ వాహన, కస్టమర్ పాలసీని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఇసుక లారీలు, టిప్పర్లు, ఇతర వాహనాల యజమానుల కోసం ప్రతిరోజు ర్యాండమైజేషన్ విధానాన్ని అమలు చేస్తుంది. దీనికోసం నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి వాహనదారుడికి ఒక ఐడీ కేటాయిస్తుంది. నిబంధనల ప్రకారం.. ఉదాహరణకు ఈ ఐడీ కలిగిన ఒక లారీ యజమాని టీజీఎండీసీ స్టాక్ యార్డులోని ఇసుక కోసం ప్రతిరోజు ఆన్లైన్ ద్వారా రాండమైజేషన్ విధానంలో బుక్ చేసుకుని ఒక డీడీ మాత్రమే పొందే అవకాశం ఉంటుంది. పోటీ తీవ్రత వల్ల ఇలా ప్రతి రోజూ బుక్ చేసిన లారీల యజమానుల్లో ఎక్కువమందికి డీడీలు లభించవు. కొంతమందికి మాత్రమే అదృష్టం వరించి ఇసుక కోసం ఆన్ లైన్ ద్వారా ఒక ఐడీకి ఒక డీడీ చొప్పున సాండ్ డీడీలు దక్కటం జరుగుతుంది. అయితే ఇందులో కొందరు ఒకటి కంటే ఎక్కువ డీడీలు పొందుతుండటం ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాట్ టాపిక్ అయింది.

**టీజీఎండీసీలో రాండమైజేషన్ 'మాయ'**
**స్టాక్ యార్డుల్లోని సాండ్ బుకింగ్ లో 'గోల్ మాల్'**
**ఒకే ఐడీ.. ఒకేరోజు.. నాలుగు డీడీలు!**

### రెండు నుంచి నాలుగు డీడీలు!

రాండమైజేషన్ విధానంలో ఇసుక కోసం లారీలు యజమానుల్లో ఎక్కువ మందికి వారం పది రోజులకు ఒక డీడీ దక్కుతుంది. ఈ క్రమంలో కొందరు ఒకే ఐడీపై ఒకే రోజు రెండు నుంచి నాలుగు డీడీలను పొందుతుండటం తాజాగా బయటపడింది. ప్రతిరోజు ఆన్లైన్ ద్వారా ఇసుక డీడీల కోసం ప్రయత్నించి నిరాశ చెందుతున్న లారీల యజమానులు అనుమానంతో కొద్దిరోజుల నుంచి లోతుగా పరిశీలించటం మొదలుపెట్టారు. ఆన్లైన్ ద్వారా వాహనదారులు పొందుతున్న ఇసుక డీడీల జాబితాను పరిశీలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఒక వ్యక్తి ఇటీవలి కాలంగా ఒకే రోజు రెండు నుంచి నాలుగు డీడీలను పొందినట్లు గుర్తించారు. ఈ నెల 26న ఆ వ్యక్తి ఒకే ఐడీపై నాలుగు డీడీలను పొందాడు. అంతకుముందు ఏప్రిల్ 30న, మే 11న, 20న, ఈ నెల 9న రెండేసి డీడీలను దక్కించుకున్నాడు. ఇలా అడ్డదారిలో పొందిన డీడీలతో భూపాలపల్లి జిల్లాలోని క్వారీలతో పాటు ఇతర క్వారీల్లోని స్టాకు యార్డుల నుంచి ఇసుక రవాణా చేశాడు. ఈ వ్యక్తి ఒకే ఐడీపై ఇలా ఒకే రోజు ఒకటి కంటే ఎక్కువ డీడీలను పొందటాన్ని ప్రశ్నిస్తున్న లారీల యజమానులు టీజీఎండీసీ ప్రధాన కార్యాలయం సహకారంతోనే ఇది సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు. ఇలాగే మరికొందరు వ్యక్తులు కూడా ఒకే ఐడీపై ఒకేరోజు ఒకటి కంటే ఎక్కువ డీడీలను పొందుతున్నట్లు చెబుతున్నారు. ఇలా దక్కించుకున్న డీడీలను ఒక్కో డీడీని మార్కెట్లో రూ.2వేల నుంచి రూ.3 వేల లాభంతో అమ్ముతున్నట్లు తెలిపారు. బాధ్యులను గుర్తించి ఈ దందాను అరికట్టడం ద్వారా తమకు న్యాయం చేయాలని శనివారం టీజీఎండీసీ ఉన్నతాధికారులను కోరారు.

## రైస్ మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: బాదం ప్రవీణ్

ములుగు, జూన్ 27 (అక్షర దర్బార్) : ములుగు జిల్లాలోని రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కోరారు. శనివారం అసోసియేషన్ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి తమ సమస్యల వినతి పత్రాన్ని అందజేసింది. గత రబీ సీజన్‌లో జిల్లాలో లక్షా 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యూర్మెంట్ జరిగిందని, గోదాముల కొరత వల్ల ధాన్యాన్ని ఆరుబయట నిల్వ చేయాల్సి వచ్చిందని ప్రవీణ్ తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం క్వాలిటీ దెబ్బతిన్నందున, జిల్లాకు బాయిల్డ్ బియ్యం ఎఫ్‌సీఐకి పెట్టేందుకు అధికారులు వెంటనే పర్మిషన్ ఇప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సీతక్క, వెంటనే సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్‌తో ఫోన్ లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సహోదరు రెడ్డి, ఎలగందుల మోహన్, పల్లెపాటి సంగిరెడ్డి, రాణి శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.



## ములుగు జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు

ములుగు, జూన్ 27 (అక్షర దర్బార్) : ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ నాగ అనేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ములుగు జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు 22,572 మంది ఉన్నారని, వారి కోసం 312 పోలియో బూత్‌లు, 10 ట్రాన్సిట్ బూత్‌లు, 15 మొబైల్ టీమ్‌లను సిద్ధం చేసినట్లు వివరించారు. వైద్య సిబ్బందితో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు.



## పర్లపల్లి వరుస దొంగతనాల కేసు ఛేదింపు

### పాత నేరస్థుడి అరెస్ట్

మొగుళ్లపల్లి, జూన్ 27 (అక్షర దర్బార్): మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్లపల్లి గ్రామంలో గత మార్చిలో జరిగిన వరుస ఇళ్ల దొంగతనాలు, బైక్ చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. శనివారం పాత ఎస్సీపేట బస్ స్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా, చోరీ చేసిన పల్సర్ బైక్‌పై వెళ్తున్న ప్రధాన నిందితుడు దాసరి మురళీకృష్ణ (30)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తన తండ్రి నర్సయ్య, తమ్ముడు గణేష్ లతో కలిసి పర్లపల్లిలో మూడు చోట్ల చోరీలకు పాల్పడి బైక్, రూ. 5,000 నగదు, నగలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు రాష్ట్రంలో 42కు పైగా కేసుల్లో ఉన్న పాత నేరస్థుడని సీఐ డి. మల్లేష్, ఎస్సై ఎం. సురేష్ తెలిపారు. పరారీలో ఉన్న మిగతా ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.



## 15 రోజుల్లో పరకాల పట్టణాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దుతాం

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

పరకాల, జూన్ 27 (అక్షర దర్బార్): పరకాల పట్టణాన్ని 15 నుండి 20 రోజుల్లో క్లీన్ సిటీగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, కమిషనర్ పోతరాజు పవన్ లతో కలిసి నిర్వహించిన పురపాలక సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 డిసెంబరు నాటికి పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం రూ. 4.68 లక్షల వ్యయానికి, అలాగే మూడు స్వచ్ఛ ఆటోల కొనుగోలుకు మరియు కార్యాలయంపై సోలార్ పవర్ ఏర్పాటు ప్రతిపాదనలకు సమావేశం ఆమోదం తెలిపింది. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు జరగాలని, స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.






## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, జూన్ 27 (అక్షర దర్బార్): చిట్యాల మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను శనివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. చల్లగరిగ గ్రామానికి చెందిన గులాం జిలాని మృతి చెందగా వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జూకల్ గ్రామంలో మరణించిన రైతు సౌడ కిషన్ కుటుంబ సభ్యులను, అలాగే తిరుమలాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి చనిపోయిన రెండేళ్ల చిన్నారి అన్వి తల్లిదండ్రులను కలిసి ఓదార్చారు. ఈ పరామర్శల్లో మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, పిట్టా సురేష్ పాల్గొన్నారు.




## పేదల గుడిసెలను కూల్చివేస్తే ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదు

హనుమకొండ, జూన్ 27 (అక్షర దర్బార్): నిలువ నీడ లేక పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేస్తే చూస్తూ ఊరుకోమని, గత పాలకులకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని వామపక్షాల రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, జాన్ వెస్లీ, గాదగోని రవి మరియు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య హెచ్చరించారు. శనివారం వామపక్ష పార్టీల ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరుపేదలపై ప్రభుత్వ దౌర్జన్యాలను నిరసిస్తూ ఏకశిలా పార్క్ నుండి అదాలత్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా గత పాలకుల వలె నిర్బంధాలను కొనసాగిస్తూ పేదలపై ప్రతాపం చూపిస్తోందని విమర్శించారు. ఆందోళనతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు నాయకులను, కార్యకర్తలను బలవంతంగా అరెస్టు చేశారు. ఈ నిరసనలో పెద్దారపు రమేష్, కర్రే బిక్షపతి, గాదె ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్రంలో కామన్ స్కూల్ విద్యా విధానాన్ని తక్షణమే అమలు చేయాలి

చెన్నారావుపేట, జూన్ 27 (అక్షర దర్బార్): రాష్ట్రంలో అందరికీ సమానంగా ఉండేలా కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని ఏఐఎఫ్డీఎస్ (అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య) వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీ విపరీతంగా పెరిగిపోయిందని, కనీస సౌకర్యాలు మరియు ఫైర్ సేఫ్టీ లేని ఇరుకు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు ఏ ఒక్క ప్రైవేట్ స్కూల్‌ను కూడా అధికారులు తనిఖీ చేయకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం విద్యాసంస్థలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు అధిక నిధులు విడుదల చేసి ప్రైవేటుకు దీటుగా మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



## భూపాలపల్లి డీపీఓ పరిపాలన విభాగాన్ని తనిఖీ చేసిన ఎస్పీ సంకీర్త్

భూపాలపల్లి, జూన్ 27 (అక్షర దర్బార్): వార్షిక తనిఖీల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లోని పరిపాలన (అడ్మినిస్ట్రేటివ్) విభాగాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తున్న పరిపాలనా రికార్డులు, సర్వీస్ రిజిస్టర్లు, ఫైళ్ల నిర్వహణ మరియు పెండింగ్ అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా ఉంచాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సంబంధిత అధికారులకు సూచించారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా

### ఎమ్మెల్యే గండ్ర

మొగుళ్లపల్లి, జూన్ 27 (అక్షర దర్బార్): జర్నలిస్టుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హామీ ఇచ్చారు. మొగుళ్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల సారయ్య ఆధ్వర్యంలో మండల జర్నలిస్టులు భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, మొగుళ్లపల్లిలో ప్రెస్ క్లబ్ భవన ఏర్పాటుకు త్వరలోనే కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కట్కూరి ఐలయ్య, తోకల వేణు, ఉప్పుల రవి కిరణ్ పాల్గొన్నారు.



## సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్సైకి రూ. 25,000 చెక్ అందజేసిన సర్పంచ్

శాయంపేట, జూన్ 27 (అక్షర దర్బార్): శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు పత్తిపాక గ్రామపంచాయతీ ముందుకొచ్చింది. గ్రామంలోని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చేందుకు గ్రామపంచాయతీ తరఫున సర్పంచ్ గజ్జి ఐలయ్య, ఉప సర్పంచ్ తుడుం రాజు కలిసి స్థానిక ఎస్సై పరమేశ్వర్‌కు రూ. 25,000ల విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామ భద్రత కోసం పంచాయతీ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని, త్వరలోనే కెమెరాలు అమర్చి పర్యవేక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కోర్రె రాజారాం, తుడుం క్రాంతి కుమార్ పాల్గొన్నారు.




## శాయంపేట మండల రైతు వేదికలలో విత్తన మేళాను పరిశీలించిన ఏడీఏ ఆదిరెడ్డి

శాయంపేట, జూన్ 27 (అక్షర దర్బార్): వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఆదిరెడ్డి శనివారం శాయంపేట మండలంలోని పెద్దకోడేపాక, గట్లకానిపర్తి మరియు శాయంపేట క్లస్టర్లను సందర్శించి రైతు వేదికలలో నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెలలో వరి సాగు చేయదలచిన రైతులు తక్కువ కాల వ్యవధిలో పండే కేఎన్ఎం-7715, కేఎన్ఎం-1638 మరియు ఆర్ఎన్ఆర్-15048 వంటి రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాగే పాత, కొత్త పట్టాదారులలో రైతు భరోసా పథకానికి సంబంధించి బ్యాంకు ఖాతా మార్పులు లేదా సాంకేతిక సమస్యలు ఉన్న రైతులు ఈ నెల 30 లోపు అవసరమైన రికార్డులతో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మార్క ప్రియదర్శిని పాల్గొన్నారు.



# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

- ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై నిర్లక్ష్యం వద్దు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




అక్షరదర్బార్, హనుమకొండ: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా కాజీపేటలో ఒక ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్, కాజీపేట దర్గా పీఠాధిపతి కుసూరు పాషా ఆధ్వర్యంలో శనివారం ఆయన నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా.. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, డాక్టర్ పి వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రతి ఓటరుకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా, అవసరమైన సవరణలు చేసుకునేలా పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అపోహలు, సందేహాలకు తావు లేకుండా ప్రజలకు సరైన సమాచారం చేరవేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీలపై ఉందన్నారు. ప్రతి ఇంటికి, ప్రతి ఓటరికి ఈ ప్రక్రియ గురించి వివరించి అవగాహన కల్పించేందుకు తాను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

– ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'ఎస్ఐఆర్ వార్ రూమ్'

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారం, మార్గదర్శకాలు, అవసరమైన సహాయం అందించేందుకు బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా ఎస్ఐఆర్ వార్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది వాటిని వెంటనే నివృత్తి చేసి, అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ వివరాలను పరిశీలించుకోవాలని పిలుపునిచ్చారు.